క్లుప్తంగా

నేడు కొల్కులపల్లిలో బొడ్రాయి వార్షికోత్సవం

మాడ్గుల: మండలంలోని కొల్కులపల్లి గ్రామంలో ఆదివారం నాభిశిల(బొడ్రాయి) ద్వితీయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు బట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బొడ్రాయి వద్ద గణపతిపూజ, అభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు.

వెయిటింగ్ హాల్ ప్రారంభం


గదిని ప్రారంభిస్తున్న జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా కార్యాలయంలో వినియోగదారుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను శనివారం జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ ప్రారంభించారు. దాతల సహకారంతో వీటిని పూర్తి చేశామని ఆయన తెలిపారు. అలాగే వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణాశాఖ అధికారి సుభాష్‌చంద్రరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో తుల్జాభవాని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, ఆలయ నిర్వాహకులు దుద్యానాయక్, సోమ్లు, దేనానాయక్, మోత్య, భీక్యానాయక్, రెడ్యానాయక్, హీరాసింగ్, తులసిరామ్, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసంతర్పణ


అన్నం వడ్డిస్తున్న శ్రీనివాసురెడ్డి తదితరులు

తలకొండపల్లి: అన్నదానం గొప్పదని ప్రముఖ వ్యాపారవేత్త, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాసురెడ్డి అన్నారు. సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని దానం చేయాలన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వర దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం వాలీబాల్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 18వ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మెన్స్ అండ్ ఉమెన్స్ సీనియర్, జూనియర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాసు శ్రీనివాసురెడ్డి భక్తులు, క్రీడాకారులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పాఠశాలకు మొక్కల వితరణ


మొక్కలకు నీరు పోస్తున్న ప్రధానోపాధ్యాయుడు పరమేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం మరువలేనిదని పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ పేర్కొన్నారు. ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలకు ఎస్‌బీఐ ఆదిబట్ల బ్రాంచ్ మేనేజర్ వసంత లలిత రాజమండ్రి, తూర్పుగోదవరి ప్రాంతంలోని కడియంలంక నుంచి 200 జామ, రావి, ఉసిరి, నేరేడు, సపోట, నిమ్మ, బాదంతో పాటు పూల మొక్కలు తెప్పించి అందజేశారు. శనివారం వాటిని నాటి నీరు పోసి సంరక్షించారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన పోతుగంటి ఆంజనేయులు ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు బాధితుడు ఆంజనేయులుకు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు ట్రస్టు సభ్యులతో రూ.పది వేలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలితాజ్యోతయ్య, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్‌యాదవ్, నాయకులు మల్లేష్‌యాదవ్, మహేష్ పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చేయూత

మండల పరిధిలోని చంద్రధనకు చెందిన చంద్రయ్య(62) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.మూడు వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు శేఖర్, చెన్నయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఎండా కాలం.. జీవాలకు గండం!

అడుగంటిన నీటి వనరులతో పశుకాపరులు, పాడి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నరకయాతన చెందుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

- మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు కొరవడిన చర్యలు
- తొట్లల్లో నీళ్లు లేక పశుకాపరుల ఆందోళన
- పట్టించుకోని అధికార యంత్రాంగం


తక్కళ్లపల్లిలో నిరుపయోగంగా మారిన పశువుల నీటి తొట్టె


నస్దిక్‌సింగారంలో నీళ్లు లేక ఎండిపోయిన చెరువు

యాచారం: మండే ఎండలతో అన్నదాతల గుండెల్లో ఆందోళన మొదలైంది. నీటి వనరులు అడుగంటడంతో మూగజీవాల దాహార్తికి పశు కాపరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో చింతపట్ల లక్ష్మణ్ చెరువులో మినహా మండలంలోని చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేక పగుళ్లు వచ్చి నెర్రలు బారాయి. మండలంలోని 24 గ్రామాల్లో 500 మందికి పైగా కాపరులు 75 వేలకు పైగా గొర్రెలు, మేకలను సాకుతున్నారు. మరో 300 మందికి పైగా రైతులు 20 వేలకు పైగా పాడి పశువులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత దృష్ట్యా బోరుబావుల్లోని భూగర్భజలాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. పీఏసీఎస్, కమర్షియల్ బ్యాంకుల్లో రుణాలు పొంది 400 మందికి పైగా రైతులు డెయిరీ, పౌల్ట్రీఫాంలను నడిపిస్తున్నారు. నీటి ఎద్దడితో కోళ్ల పెంపకం, మూగజీవాలకు దాహార్తికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని రైతన్నలు వాపోతున్నారు.

కంపచెట్లు మొలిచాయి

చౌదర్‌పల్లి, నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, గడ్డమల్లయ్యగూడ, కొత్తపల్లి, చింతుల్ల, ధర్మన్నగూడ తదితర గ్రామాల్లో ఎక్కువ మంది గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి ఉన్నారు. ఏళ్ల కిందట ఈజీఎస్, నాబార్డు, ఆర్‌డబ్ల్యూఎస్ పథకాల కింద మండలంలోని పలు గ్రామాల్లో రూ.కోటికి పైగా ఖర్చు చేసి నీటి తొట్టెలను నిర్మించారు. అవి వాడుకలో లేక కంపచెట్లు మొలిచి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. గతేడాది సాధారణ వర్షాలు కురవడంతో బోరుబావుల్లో ఉన్న నీటితో మూగజీవాల దాహార్తి తీరింది. ప్రస్తుతం నీటి వనరులు సన్నగిల్లుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రతకు కొద్దిపాటి భూగర్భజలాలు మరింత లోతుకు పోయి నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది.

“చర్యలు తీసుకుంటాం



మండలంలోని పలు గ్రామాల్లో పాడి పశువులు, గొర్రెలు, మేకలకు నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటాం. ఎండల తీవ్రత చూస్తే మరో రెండు నెలలు భూగర్భజలాల పరిస్థితి దారుణంగా మారే అవకాశం ఉంది. ఎంపీడీఓ, గ్రామాల ప్రత్యేకాధికారులతో సమావేశమై నీటి తొట్లల్లో నీళ్లు నింపేలా చర్యలు తీసుకుంటాం.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

పీఏసీఎస్ అభివృద్ధికి సభ్యుల సహకారం

చైర్మన్ పాండు రంగారెడ్డి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైర్మన్ ఎదుళ్ల పాండు రంగారెడ్డి కోరారు. శేరిగూడలోని పీఏసీఎస్ కార్యాలయంలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ద్వారా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. అన్నదాతలకు ఎప్పుడూ తమ సహకారం ఉంటుందన్నారు. సంఘం అభ్యున్నతికి సభ్యులంతా పాటుపడాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రైస్‌మిల్లును త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. లాభాల బాటలో పయనిస్తున్న సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. కాగా లాభాలు, ఖర్చులు, రుణాలు తదితర సంబంధిత అంశాలపై చర్చించారు. సమావేశంలో సీఈఓ గణేశ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా సొసైటీ

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగిన వెంకట్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సొసైటీ ద్వారా ఆర్థిక సహాయం చేశారు. శనివారం మృతుని భార్య పద్మకు రూ.15 వేల చెక్‌ను డైరెక్టర్లు అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ గణేశ్, మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, సుధాకర్‌రెడ్డి, పోచమ్మ, పుల్లయ్య, సీతయ్యలున్నారు.

వైభవంగా రథోత్సవం

కొనసాగుతున్న దేవుని పడకల్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించారు. యువకులు కేరింతలు కొడుతూ ఉత్సాహభరితంగా రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజుకుమార్‌రెడ్డి, కార్య నిర్వాహకులు రంజిత్‌రెడ్డి, మధుకుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, శంకర్, శంకర్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు కృష్ణగౌడ్, స్వామిగౌడ్, సిబ్బంది ఆంజనేయులు, జంగయ్య, మల్లేష్, జగ్గారెడ్డి పాల్గొన్నారు.


భారీగా పాల్గొన్న భక్తులు

హుషారుగా ముగింపు


ఆమనగల్లు: పరీక్షా కేంద్రం వద్ద విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు

ఆమనగల్లు: ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాలలో పదో తరగతి పరీక్షలు శనివారం సజావుగా ముగిశాయి. ఆమనగల్లు మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు, కడ్తాలలో మూడు, తలకొండపల్లిలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో ఈ నెల 18న ప్రారంభమైన పరీక్షలు శనివారం ముగిశాయి. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. విద్యార్థులు ఒకరినొకరు కలిసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలువురు విద్యార్థులు సెల్ఫీలు దిగారు.

ముగిసిన పది పరీక్షలు

మాడ్గుల: మాడ్గుల మండలంలో పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. చివరి రోజున విద్యార్థులు ఉత్సాహంతో పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలగడంతో విద్యార్థులు రెట్టింపు ఉత్సాహంతో కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు.

కనుల పండువగా కల్యాణోత్సవం


ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు


స్వామి వారి ఉత్సవ విగ్రహాలు


కల్యాణోత్సవాన్ని తిలకించడానికి తరలివచ్చిన భక్తులు

యాచారం తిరుమలనాథ ఆలయానికి భక్తుల తాకిడి

యాచారం: గోవిందా.. గోవిందా.. అనే నామస్మరణతో శనివారం యాచారం గ్రామం మార్మోగింది. తిరుమలనాథ దేవాలయ ఆవరణలో జరిగిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామివారి మూల విరాట్‌కు పూజారులు రాజేశ్‌కుమార్, హరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సన్నాయి, భజన కీర్తనల నడుమ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అలువేలు మంగమ్మల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించడానికి జిల్లాలోని పలు మండలాలతో పాటు నల్గొండ, హైదరాబాద్, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి

స్వామి వారి కల్యాణోత్సవంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, మాజీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్


సన్మానసభలో మాట్లాడుతున్న ఫారూక్‌హుస్సేన్

ఆమనగల్లు: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే ఎక్కడైనా తగిన గుర్తింపు లభిస్తుందని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కల్యాణి గార్డెన్స్‌లో శనివారం ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్ పదవీ విరమణ సందర్భంగా సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ దంపతులను ప్రజాప్రతినిధులు ప్రభుత్వాధికారులు వేర్వేరుగా సత్కరించారు. ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రభుత్వాధికారిగా ప్రజలకు నీతి, నిజాయితీలతో సేవలు అందించానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు సరితపంతునాయక్, కుమార్, మాజీ సర్పంచ్‌లు బాల్‌రాం, లక్ష్మణ్, శ్రీనయ్య, యాదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, ఎంపీడీఓలు వెంకట్రాములు, శ్రీకాంత్, సరస్వతి, హిమబిందు, సుమతి, విజయ్‌బాస్కర్, రవిచంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ సూపరింటెండెంట్ గణపతి, తహసీల్దార్ లలిత, ఎంఈఓ సర్దార్‌నాయక్, ఎంపీఓ సూజత, సిబ్బంది కృష్ణయ్య, రాకేశ్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా శ్రీకాంత్

ఆమనగల్లు ఇన్‌చార్జి ఎంపీడీఓగా తలకొండపల్లి ఎంపీడీఓ శ్రీకాంత్‌ను నియమించారు. ఆమనగల్లు ఎంపీడీఓగా పనిచేసిన ఫారూక్‌హుస్సేన్ పదవీ విరమణ చేయడంతో శ్రీకాంత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమనగల్లు ఎంపీడీఓగా నియమితులైన శ్రీకాంత్‌ను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కూలీలందరికీ పని కల్పించాలి

ఏపీడీ సక్రియ నాయక్

మంచాల: గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలందరికీ పని కల్పించాలని ఏపీడీ సక్రియ నాయక్ సూచించారు. శనివారం మండలంలోని బోడకొండ, కొర్రవాణి తండా, రంగాపూర్, లోయపల్లి, అంబోత్ తండా గ్రామాల్లో పర్యటించారు. పని ప్రదేశాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తాగు నీటికి ప్రతి మనిషికి రూ.2.50 చొప్పున చెల్లించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తేనే దినసరి కూలీ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వీరాంజనేయులు, టీఏ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు శోభరాణి, మాధవి, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు విరాళం

కడ్తాల్: మహనీయులను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని చరికొండ గ్రామంలో యువక్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు ఆయన రూ.10 వేల విరాళాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవ సమాజ నిర్మాణానికి జ్యోతిబాపూలే ఆలోచనలు, ఆశయాలు నేటి యువతకు ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రయ్య, అశోక్, యాదయ్య, రమేశ్, కృష్ణ, మహేందర్, జంగయ్య, బాషా, శ్రీశైలం, పెద్దయ్య, రాజు, యాదయ్య పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. అందులో భాగంగా శనివారం తుర్కయంజాల్‌లోని 12వ వార్డు కౌన్సిలర్ కీర్తనవిజయానందరెడ్డితో కలిసి ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. 30 మంది సిబ్బందితో ఏవీనగర్, వింటేజ్ హోమ్స్, ఆదిత్యానగర్, టీచర్స్‌గిల్డ్ కాలనీ, కుర్మగూడలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌ను ఒకేసారి ఉపయోగించవద్దని ప్రజలకు సూచించారు. చెత్తను ఆరుబయట వేయొద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, నాగేశ్, ఈఈ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఐక్యతా ర్యాలీ

యాచారం: మండల కేంద్రంలో క్రైస్తవులు శనివారం ఐక్యత ర్యాలీ నిర్వహించారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని మండలంలోని పలుగ్రామాలకు చెందిన పాస్టర్లు ర్యాలీలో పాల్గొన్నారు. సాగర్‌రోడ్డుపై ఉన్న సాయి శరణం ఫంక్షన్ హాల్ నుంచి గాండ్లగూడెం చౌరాస్తా వరకు పాస్టర్లు ఐక్యత ర్యాలీని నిర్వహించారు. పాస్టర్లు మాట్లాడుతూ.. క్రైస్తవ కుటుంబాల్లోని పేదలకు ఇళ్లు, పింఛన్లు, జీవనోపాధుల కోసం బ్యాంకు రుణాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు చేరుకూరి రాజు, సంజీవ, భాస్కర్, ప్రభాకర్, డానియల్, బాలరాజ్, కిష్టోఫర్, జోసఫ్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న పాస్టర్లు

ఘనంగా విగ్రహాల గ్రామోత్సవం

శివసీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో శివసీతారామాంజనేయస్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల గుండా అత్యంత శోభాయమానంగా ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు మంగళహారతి, కొబ్బరికాయ సమర్పించి స్వాగతం పలికారు. శుద్ధ జలంతో విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కుమార్‌గౌడ్, నరోత్తంరెడ్డి, వెంకటయ్యగౌడ్, నగేశ్, యాదయ్య, కృష్ణయ్య, గిరి, రామచంద్రయ్య, జనార్దన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజురెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు